# ఇరుకు గది

**బి. శ్రీ**

"కొండలమధ్య నిలబడి, 'కో!' అంటే, తిరిగి 'కో!'అంటాయి కొండలు. విచ్చలవిడిగా పెరిగిన అరణ్యాల మధ్య నిలబడి నిన్ను చూచుకుని, నువ్వే పెద్ద అడవిజంతువుగా భ్రమించి భయపడతావు. ఆకాశం పర్వతాలను ఆనుకుని, 'చాందినీ'లా కనపడుతుంది. పచ్చని నేలపై పదిలంగా నిలబడ్డ పెను బండలు అనల్పమైన పర్వతాల ముందు అల్పమైన ఆకారాలు.

"బెబ్బులి మృగరాజులా అరిస్తే అర్ధరాత్రి అరణ్యంలో నువ్వు మరో మృగరాజులా బ్లాక్‌డెవలప్‌మెంట్ కట్టించిన బంగళాలో పడుకుని భావించుకోవచ్చు" అన్నాడు సుందర్రావు.

సుందర్రావు మారేడుమిల్లిలో ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు సంవత్సరాల అనుబంధం ఈ పరిసర ప్రదేశాలతో అతనికి.

శీతాకాలంలో ఒకే దుప్పటి కింద నాలుగు కాళ్లను జ్ఞాపకం చేసే చలిని తలుచుకుంటూ బయలుదేరాడు మారేడుమిల్లి. సుందర్రావుకు చలి మీద సదభిప్రాయం లేదు. చలికంటె పులి నయం అని వాడి అభిప్రాయం. ఒకరి అభిప్రాయాల జోలికి మరొకరు వెళ్లకుండా మారేడుమిల్లి చేరుకోవాలనేది మా ఏకాభిప్రాయం.

ఆకసాన్ని అందుకుంటున్న శిఖరాలూ, వాగుల ఒంపులూ, కనుచూపుమేరలో తళుక్కున మెరిసే పాపికొండల సొగసులూ మారేడుమిల్లికి ఆభరణాలు. చెట్లచాటున దాముకుని, వంగి చూస్తే పొంగి దూకే సెలయేళ్లు ఆ చుట్టుపట్ల.

"అనుకున్నట్టు మారేడుమిల్లి వచ్చాం. నెమలికంఠం గువ్వలనూ, పురివిప్పి నాట్యం చేస్తున్న నెమళ్లనూ చూశారు. మరేమి చూస్తారు?" అని ప్రశ్నించాడు సుందర్రావు.

మడతలు నలగకుండా పదిలంగా నిలబడ్డవాడిని చూస్తే నవ్వు వచ్చింది. జీవితంలో ప్రతి చిన్న విషయం గురించీ జాగ్రత్త పడితే అనేక గొప్ప అనుభవాలను కోల్పోతాం. జీవితానికి నూతనానుభవాల థ్రిల్ కావాలి. అనుభవాల ఆనవాళ్లలో పడి మనిషి నూతన పరిణామాల ఫలాలు అందుకోవాలి. మార్పే అభివృద్ధి అని నమ్మిన మనిషిని నేను.

నాకు బైసన్ కొమ్ములూ, కోయ ప్రజల పండగ దుస్తులూ, వారి జానపద కళారూపాలూ కావాలి. వీలైతే వాల్మీకిసంతతి వారితో కలిసి కొన్ని రోజులు నివసించగలగాలి. పట్నవాసపు మనుషుల ప్రవేశంతో వారిలో వచ్చిన మార్పులు చూడాలి.

"ఆల్‌రైట్! రేపు అన్నీ అరేంజ్ చేస్తాను. మీరు మాత్రం జాగ్రత్తగా ప్రవర్తించాలి. 'స్నేహానికి ప్రాణం పెట్టడం, శత్రువుకు ప్రాణం తియ్యడం' అనేది జంగిల్‌లా. ఈ చుట్టుపట్ల వారంతా వాల్మీకి సంతతివారు. రేపు మీ కొక దొరని తోడిస్తాను. కొంచెం ఇంటీరియర్‌లోనికి వెళితే ఈ లోయలో జీవితవిధానం చూడవచ్చు" అన్నాడు సుందర్రావు. సుందర్రావు పని చేయుస్తున్న బ్రిడ్జి దగ్గరినుంచి వెనక్కి తిరిగాం.

కొండవాలులో పోడు వ్యవసాయం చేయిస్తున్నాడు దొర. అడవిని నరికి అమృతం చిలికినట్టు జొన్నవిత్తులు జల్లితే బంగారం గంపల కెత్తుకోవచ్చు. పక్షులూ, పులులూ ఒకే రకమైన శత్రువులు దొర దృష్టిలో. మంచె కట్టి, మంచెకు నాలుగు వైపులా గెడలు నాటి, వాటికి గెడకణుపులు కట్టి, వాటి తాళ్లను చేతితో లాగుతున్నాడు దొర. ఆ భయంకరమైన శబ్దానికి పక్షులూ, పులులూ ఎగిరి పోతాయి.

తొలిసారి ఆ శబ్దం విన్న నన్ను భయం ముట్టడించింది.

"హమ్మయ్య! మంచె దగ్గిరికి వచ్చాం" అన్నాడు నాగరాజు.

క్రిందికి చూస్తే అనంతమైన లోయ. లోయనిండా పచ్చటి చీకటి.

"ఏమిటది!" అన్నాను ఆశ్చర్యంగా.

"అది చీకటి కాదు; అవన్నీ కమలాఫలం తోటలు. పద, దొర మనల్ని చూచినట్టున్నాడు. మంచె దిగి వస్తున్నాడు." మల్లేశ్వరరావు.

"నమస్కారం! నమస్కారం! ! దండాలు, దొరబాబులూ" అన్నాడు దొర.

"నమస్కారం, దొర్‌గార్! నమస్కారమ్! మీరు మాకు ఇంత సాయం చెయ్యాలి" అన్నాడు పని పరిమాణాన్ని చేతులతో అభినయిస్తూ పేరంటాలు.

"మీరు మా లాగి మాటాడింద్రు" అన్నాడు దొర.

"పేరిదొర్గార్. పేరిదొర్గారంటె గంతె" అన్నాడు దొర రెండు చేతులూ పట్టుకుని పేరంటాలు.

తంటాలకు మారుపేరు ఈ పేరంటాలు. దొరగారి కెక్కడ కోపం రప్పిస్తాడో అని భయపడ్డాం.

"మనకు గాంధి లేదుగింద. ఈ గుడానికి నాను దొరనేమొ. నా దగ్గిర రెండు బిందెల బంగారమున్నదేమొ. ముగ్గురు బొట్లకి నాను పెథువునేమొ" అన్నాడు దొర.

తన కున్న ధనధాన్యాలతో, తాను కట్టుకుని కాపురం చేసుకున్న స్త్రీల ఆధిక్యంతో తన గొప్పతనాన్ని చాటుకునే ఆదిమ, ఆటవిక, అనాగరికమైన అలవాటు. స్త్రీకి ఆలోచించడానికి మెదడూ, అనుభవించడానికి తనదైన శరీరం, సౌందర్యానికి అలవాటుపడ్డ కళ్లూ, కొన్ని అలవాట్లకు లోనైన జీవితం ఉంటాయని తెలియని మనిషి.

"ఎందరు బొట్లని కట్టుకున్నావ్?" అని అడిగాడు పేరంటాలు.

"రండి, నా గుడానికి, నా తడాక మూపెడుదును."

విల్లు భుజానికి తగిలించుకుని దొర నడుస్తుంటే, అతని వెనక కొండ దిగటం మా కెంతో కష్టమనిపించింది. వాలుకు తగిన వేగంతో దొర కొండ దిగుతున్నాడు. మేం పెద్దరాళ్లనూ, చెట్లకొమ్మలనూ పట్టుకుంటూ దిగగలిగాం. దొర కొండ దిగిన అర గంటకు కాని మేం లోయలో ప్రవేశించలేకపోయాం. విల్లు భుజానికి తగిలించుకుని, ఎడమ చెయ్యి తొడపై ఆన్చి, కుడి చేతితో కోర మీసం మెలిపెడుతూ దొర మా వైపు చూస్తున్నాడు. కొంచెం జాగ్రత్తగా ఆలోచించి ఉంటే రవివర్మ రాముని చిత్రం ఈ రకంగా చిత్రించి ఉండేవాడనిపించింది.

గలగల ప్రవహిస్తున్న నీటిప్రవాహం పక్కనే నడుస్తున్నాం. రాళ్లపై నుంచి దూకుతున్న ప్రవాహం అడవి నిశ్శబ్దాన్ని చీలుస్తోంది. ఎక్కడో చెట్ల చీకటి కొమ్మల వెనక పక్షుల కలస్వనాలు అడవి ఆలపిస్తున్న విషాదగీతాలు.

"ఈ అడివంతా నాదే నేమొ" అన్నాడు నవ్వుతూ దొర.

"కాంచితిమిలే, కాంచితిమి!!" అన్నాడు పేరంటాలు.

"ఇప్పు డేమి కాంచితివిలే—ముందు నూడు, మునుముందు నూడు— ఈ దొరంటె గుడాని కడలు" అన్నాడు మీసం మెలి వేస్తూ, వెనక్కి తిరిగి దొర.

మనిషి గొప్పతనం చాటుకోవడానికి తోటి మానవుని మనశ్శాంతిని భంగపరచవక్కరలేదు. మూకఉమ్మడిగా ఆదిమ కాలంలో అలవాటుపడ్డ మనిషి నేడు తానెంత స్వశక్తిపై ఆధారపడి బ్రతుకుతున్నా, పాత జంతులక్షణాలను కోల్పోలేకపోతున్నాడు. కొన్ని జంతువులు కలిసి ఒక గ్రూపుగా బ్రతకడం. వాటి కొక లీడర్. ఒక గ్రూపు మరొక గ్రూపుపై పోరాటం ప్రకటించడం. మతాలు, కులాలు, వ్యక్తిపూజలు— అబ్బా! ఎంత కుళ్లు పేరుకుపోయిందీ లోకంలో!! మతం పేరుతో జంతు లక్షణాలు సలక్షణంగా కాపాడుకుంటున్నాడీ మానవుడు. మనిషి గొప్పతనం తోటి మానవుని ప్రేమతో, దయతో ఆదుకోవడం వల్ల వ్యక్తం అవుతుంది. అంతేగాని గొంతు చించుకుని చేసే భజనల వల్ల కాదు, మౌనవ్రతాల మాయల వల్ల

కాదు. అతని క్రూరత్వం వల్ల అసలే కాదు.

పర్వతం పాదాల దగ్గిర అర్ధ వృత్తాకారంలో ఉన్నాయి గుడిసెలు. వాటి చుట్టూ పెద్ద పెద్ద వృక్షాలూ, కమలాల తోటలూ ఉన్నాయి, దొరను చూడగానే ఆడవాళ్లంతా గుడిసెలోకి వెళ్లిపోయారు. పిల్లలు మమ్మల్ని వింతగా చూస్తున్నారు.

"అదు సూడు, దొర—వన్ను సూడ నట్టు పోతుంటాడు. ఆడి పని సూత్తు నేను" అని విల్లు ఎక్కు పెట్టి బాణం విడిచాడు దొర. ఇదంతా రెప్పపాటులో జరిగిపోయింది.

"హా!" అని కేక వినపడింది.

అటు చూస్తే కాలి పిక్కలో గుచ్చు కున్న బాణాన్ని లాక్కుంటున్న పాతికేళ్ల కుర్రాడివి చూశాం. కాలినుంచి రక్తం ధారగా ప్రవహిస్తోంది. దబ్బపండు వంటి పిక్కపై సింధూరం వంటి రక్తం — భయంకరమైన రక్తం.

"ఎంత పని చేశావు!" అన్నాను కోపంగా.

"నీకు తెల్దులే, దొర!" అన్నాడు ఏమీ జరగనట్టు దొర.

"నిన్ను నేను సూడనైతిని, దొర— ఈ తప్పు కాసి నన్ను కాపాడు మరి" అని రెండు చేతులూ జోడించాడు పాతికేళ్ల కుర్రాడు.

"కాకరాకు కట్టు కట్టి, మెనలివేది కట్టు తినర, పొద్ది" అన్నాడు దొర.

ఆ పాతికేళ్ల కుర్రాడు భారంగా పైకి లేచి, ఆ బాణాన్ని దొర చేతికి అందించాడు.

"ఇది నీకు కానుకగా ఇస్తిని. ఎత్తుకు పోర" అని తిరిగి బాణం ఇచ్చేశాడు ఆ కుర్రాడికి దొర.

మరికొంత ముందుకు నడిచేసరికి వెదురుగోడలతో తీర్చి దిద్దిన పెద్ద ఇల్లు కనపడింది. చుట్టూ పెద్ద పెద్ద రాళ్లు పేర్చారు. ఇంటికి మూడు వక్కలా సిల్వర్ ఓక్ వృక్షాలు ప్రహరీ లాగ నిలబడి ఉన్నాయి. మిరియాల తీగలు వాటిని ప్రేయసి చేతుల్లా పెనవేసుకుని ఉన్నాయి.

దూరంగా కాఫీతోటలు చిట్టడవి లాగ కనపడుతున్నాయి. కోకో తోటలూ, ఏలకుతోటలూ పైకి లేచి వస్తున్నాయి. రబ్బరు తోటలు కొండ వాలును ఆనుకుని పర్వతం చుట్టూ వడ్డాణం లాగ పెరిగాయి.

"అట్టగ సూడు, దొర. వా రాజ్జింలో అడుగు పెట్టే తోటలు పెంచుతుండారు.



వరలక్ష్మీవ్రతం రోజు

ఫోటోలు—ఎస్. రామకృష్ణ (మయూరం)



తిన్నగుండకపోతె తలలు ఎరుగుడునేమి" అన్నాడు కసిగా దొర.

"తలలు తెగ్గొడితే తగవులు తీరవు. తలలోని భావాలను తెగ్గొట్టాలి" అన్నాను దొర వైపు చూస్తూ.

"నా చిన్నదాన్ని చూడు. నీకు తెలుద్ది కత."

మమ్మల్ని రాళ్లమీద కూర్చో మన్నాడు. అంతా రాళ్లమీద కూర్చు న్నాం. మల్లేశ్వరరావు సిగరెట్ దమ్ము లాగి నీలాకాశంపైపు చూస్తున్నాడు. పేరంటాలు చేతులు వెనక పెట్టుకుని పచార్లు చేస్తున్నాడు. వాడివి తిరిగే కాళ్లు, తిట్టే నోరు.

"తలలు తరగాలంటుండాడు దొర. మన తలలుగిని తరగడుగింద!!" అన్నాడు పేరంటాలు.

"ఏం చేద్దాం?"

పెద్ద ప్రశ్న.

"ఇప్పుడు ఎటు వెళితే గూటికి చేరుకుంటామో తెలియదు. అడివి అడ్డబడి అన్యాయంగా ఏ జంతువుగారికో ఆహుతయ్యే బదులు ఈ దొర చేతుల్లోనే చచ్చిపోదాం."

"మరో మార్గం లేదా?"

"లేదు."

"ఎలాగ?"

ఇంతలో దొర బైసన్ కొమ్ములు తలకు తగిలించుకుని వచ్చాడు. మెడలో పులిగోళ్ల పతకం మెరుస్తోంది.

భయం ముప్పిరిగొన్నది.

అడవుల్లో దారి తప్పినవాళ్లని దేవతలకు బలి ఇచ్చిన కథలు జ్ఞాపకం వచ్చాయి.

నాగరాజు నా మొహంలోకి చూశాడు.

నేను నాగరాజు కళ్లలోనికి చూశాను.

మల్లేశ్వరరావు పేరంటాలు మొహం లోకి చూశాడు.


ఎవరి మొహాల్లోనూ నెత్తురు చుక్క లేదు. సిల్వర్ఓక్ చెట్లని తాకుతున్న గాలి 'తలలు తరిగెయ్యి' అని గుసగుస లాడుతూంది.

దూరంగా అడవి అరచిన శబ్దం.

మా నిండా భయం దట్టించిన నిశ్శబ్దం.

* * *

దొర వెనక నడిచి వచ్చింది మెరుపుతీగ. జాకెట్ లేని జబ్బలు నవ్వుతున్నాయి, సూర్యకిరణాల తాకిడికి సిగ్గుపడి. రెండు శిఖరాల మధ్య లోయలోని చీకటిలాగ ఉంది భుజాల వెనక్కి జారుతున్న నల్ల చీర. చూపుల్ని బెదరగొడుతున్న సౌందర్య ప్రభవల్ల ఆ లోయలోని చీకటి ఎక్కడ ప్రారంభమై, ఎక్కడ అంత




మైనదో చెప్పడం కష్టం. పచ్చని పిడి బాకుల వంటి కళ్ళు. కాటుకతో పదును పెట్టిన కళ్ళు.

"జిలుగు తాగు, దొర!" అన్నాడు దొర.

జగన్మోహిని అమృతభాండం అలవోకగా నేలపైని మోపి, ముకుళిత హస్తాలు చిరుకుచ్చెళ్ళలో దాచుకుని నిలబడింది. చీకటి వంటి కొప్పులో సూర్యోదయం వంటి మందారం.

"నా సిలక. నా సీత. ఈ పిట్టని పట్టాను ఇదుము లెన్నో పడి. ఎట్టగైతే నేం, నేను జయించినాను. నా విశాని గుద్దినాను" అన్నాడు నవ్వుతూ దొర.

కిలకిల మని నవ్వింది 'సిలక'—మేఘాల మధ్య మేనక కాలు కదిపితే వినపడే గజ్జెల సవ్వడి ఆ నవ్వులో.

సీత తన జబ్బను చూపింది. జబ్బ పైని కళావర్ చుక్కలాగ మూడు మచ్చ లున్నాయి.

"అవేమిటి?" అని అడిగాను.

"అవి నా బాణం గురుతులు. నా సిలకకి నాను గుద్దిన విశాని."

మారేడు దొప్పల్లో మధువు నింపి ఇచ్చింది జగన్మోహిని, సీత. పేరంటాలు తాగలేదు. పేరంటాలికి ఉన్న విలక్షణ మైన లక్షణాలలో ఇది ఒకటి. అప్పుడే ఐస్ క్యూబ్స్ వేసి చల్లబరిచిన బీర్ లాగ ఉంది జిలుగు కల్లు. నాలుకపై చిరుచేదుగా, తిమ్మిరి తిమ్మిరిగా, కంఠంలో వగరుగా — అదొక అనుభవం ఆ చెట్ల నీడ మధుపానం.

"మీరు తాగినంత పోసేను నా సిలక. మంచిగ తాగండి జిలుగు" అన్నాడు దొర.

'సిలక' తన దొప్ప ఖాళీ చేసింది. మరొక దొప్ప నింపుకుని 'గడగడ' తాగే సింది. కళ్ళు మత్తుగా కదిపి, దొర భుజాన్ని ఆనుకుని నిలబడింది. సీత నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నాడు దొర. పది గంటల

సూర్యుడు బద్ధకంగా లేచి వస్తున్నాడు మంచు తెరల వెనకనుంచి. కొండ వాలు నుంచి దూకుతున్న సెలయేటి గలగలలూ, మద్దిచెట్టు చివర కూర్చుని పాడుతున్న జీలుగుపిట్ట రొదా, తల్లి కోసం అరుస్తున్న అడవిగేదె అరుపు. .

మేం కొద్ది కొద్దిగా తాగుతున్నాం. ఒకేసారి తాగి మత్తులో పడిపోతే మా తలలు తరిగేస్తారని మా భయం. బైసన్ కొమ్ములు తగిలించుకున్న తరవాత దొర ఆకారం మరీ భయంకరంగా మారింది.

రెండవ దొప్ప జీలుగు కల్లు పూర్తి చేసేసరికి చేతులు మా స్వాధీనం తప్పాయి. కాళ్ళు గాలిలో తేలుతున్నట్టున్నాయి. సీత మబ్బుల వెనక మసక చందమామ లాగ కనపడుతూంది. దొర మెడ చుట్టూ చేతులు చుట్టి, చెవిలో గుసగుస లాడుతూంది.

ఆ మత్తులో ఎన్ని దొప్పలు పూర్తి చేశామో తెలియదు. కళ్ళు తెరిచేసరికి సాయంకాలం మూడు కావస్తూంది. సీవారి గడ్డితాళ్ళ మంచంమీద నేనూ, మల్లేశ్వరరావూ పడుకుని ఉన్నాం. నాగరాజు కిత్తనారచాపపైన పడుకుని నిద్రపోతున్నాడు. పేరంటాలు జాడలేదు. ఆ ఇంటి వెనక్కి వెళ్ళాను, పేరంటాలు కోసం. మారేడు చెట్టు నీడలో ముగ్గురు రాణుల మధ్య కూర్చుని దొర నవ్వుతున్నాడు. రాణులు దొరగారి కురులు సవరించి పేలు తీస్తున్నారు. వాళ్ళంతా చుట్టలు కాలుస్తుండడం చేత పొగ మళ్ళ తిరిగి సిల్వర్ ఓక్ చెట్ల చివరికి వెళుతూంది.

"దొర మంచి మైకంలో ఉండాడు" అన్నాడు దొర, పేరంటాలుని ఉద్దేశించి.

"ఎక్కడున్నాడు?" అని అడిగాను.

"అల్లడుగో దొర" అన్నది సీత.

పేరంటాలు గుర్రుపడుతున్నాడు. లేపితే లేవలేదు.

"పేరంటాలు తాగాడా?"

"లేద్దొర. గంజాయిచుట్ట తాగిండు. గుట్టుగా పడుండాడు." చుట్ట ఒయ్యారంగా చేతో పట్టుకుని చెప్పింది సీత.

"మరి మేం వెళ్ళిపోవాలి. అప్పుడే మూడున్నర కావస్తూంది. మరొక గంట పోతే ఈ మారేడుమిల్లి లోయలో చీకటి చిందు లేస్తుంది. పేరంటాలిని కొంచెం లేపండి" అన్నాడు ప్రాణేయ పూర్వకంగా.

రాత్రి రాకాకుండానే ఆ ప్రదేశం నుంచి తప్పించుకు పోవాలి. అడవి జాతుల్లో నరబలులు ఉన్నాయని విన్నాను. రాకెట్ యుగంలో నాగరికులు సైతం దేవతలకూ, దెయ్యాలకూ ప్రీత్యర్థం తోటి మనిషిని బలి ఇస్తున్న మూర్ఖప్రజ. పెద్దవాళ్ళ మూర్ఖపు రాజకీయ సిద్ధాంతాలతో యుద్ధాలు చేసి, సామాన్యులు న.ఆ. అనే మాయ మత్తులో పడే మనుషుల్ని మాడ్చి చంపుతున్నారు.

సీత ఏదో ఆకు నలిపి పేరంటాలు ముక్కు దగ్గిర ఉంచింది. పేరంటాలు కళ్ళు తెరిచి, బద్ధకాన్ని దులుపుకుంటూ పైకి లేచాడు.

"ఈ మాపుల కుండండి, దొర. చంద్రన్న దూరంగనె దుప్పిని వేటాడి తెచ్చి మీకు కుడుపుదును."

"మేం తక్షణం వెళ్ళిపోవాలి, దొరా!"

"వళ్ళారగించండి గట్టగైతే."

సీత వెదురుబుట్ట నిండా కమలా ఫలాలు తెచ్చి మా ముం దుంచింది. మారేడుదొప్పల్లో జుంటుతేనె పోసి మా దగ్గర పెట్టింది.

"కమలాలు ఆరగించి, తేనె జుర్రండి, దొర. మాపులికి ఇప్పసారా పోత్తును" అన్నాడు దొర.

"వెంటనే బయలుదేరాలి. నిజంగా మీ సత్కారానికి కృతజ్ఞులం. మరోసారి వచ్చినప్పుడు తప్పనిసరిగా మీ దగ్గర ఉంటాం. మీ కోసం కొన్ని పిండి వంటలు తెస్తాం" అన్నాను. నా మాటలు దొరకు అర్థమయ్యాయో, లేదో తెలియదు నాకు.

మేమంతా తిరుగు ప్రయాణంలో ఉన్నాం. మా ముందు గండ్రగొడ్డలి భుజాన వేసుకుని దొర నడుస్తున్నాడు. ఉదయం పర్వతం ఎక్కి దిగిన గురించి కాళ్ళు పట్టు పట్టే వడక సాగడం లేదు.

దూరంగా గుంపు అరుస్తున్న శబ్దం వినపడుతూంది.

"ఏమి టది?" అన్నాను.

"చారల మెకాన్ని తరుముతుండారు."

పులి అరుస్తూంది.

చీకట్లు ముసురుకుంటున్న లోయలో ప్రతి అడుగూ మేం భయంతో పరుస్తున్నాం.

"అటు సూడు, దొర, ఆ శిల— ఆ శిల కత సెబుదును మీకు."

దొర మొహం జేగు పూసినట్టు మారిపోయింది. దొర చెప్పే కథపై ధ్యాస ఉంచి నడుస్తున్నాం.

దొర పుట్టతేనె కోసం వెదుకుతూ తేనెటీగల జాడలు చూస్తున్నాడు. ఆ రోజు లక్ష్మివారం. మారేడుమిల్లి సంత. పది మైళ్ళ చుట్టుపట్ల నుంచి జనం వస్తారు. బాణంమొనలూ, పప్పులూ, జొన్నరొట్టెతో తినటానికి బెల్లం కొనుక్కుంటారు. చవక రకం బట్టలకు బోలెడు డబ్బు పోస్తారు. వారు తెచ్చిన సాలపిండి, చింతపండూ, అడవి జంతువుల తోళ్ళూ చవగ్గా కొనేసుకుంటారు. కష్టార్జితాన్ని దోచుకుని, అమాయిక ప్రజల్ని అన్యాయం చేస్తున్న నాగరికులు.

దొర రెండు ఆనబ బుర్రల తేనె తీశాడు. ఇక ఇంటికి వెళదామని వెనక్కి తిరిగేసరికి స్త్రీ ఆర్తనాదం వినపడింది. ఆ కేక వినపడిన వైపు పరికించి చూశాడు దొర. స్త్రీని కింద పడేసి బలాత్కరిస్తున్నాడొక పంట్లాం వాడు. ఆమె నోరు మూసి, కిందికి అదిమి పడుతున్నా డా వ్యక్తి. ఆ స్త్రీ తప్పించుకోవడానికి పక్కకి తిరిగి పెనుగులాడుతూంది.

పెద్దపులి లేడి కంఠాన్ని కొరకడం, రాబందులు తేనెపిట్టల బోరలు చీల్చడం ఘోరం; నేరం. సహించరాని, సహించలేని అపరాధం.

దొర రాటివెనక కూర్చుని బాణం ఆకర్ణాంతం లాగి విడిచాడు. "అమ్మా!" అని కేక వినపడింది. దొర ఒక్క దూకులో వాళ్ళ దగ్గిరికి వెళ్ళాడు.

బాణం డొక్కలో గుచ్చుకుంది. రక్తం తెల్లచొక్కాని చీల్చుకుని వస్తూంది. మోకాళ్ళమీద కూర్చుని, బాణాన్ని చేతితో పట్టుకుని ఉండిపోయాడు పంట్లాం వాడు.

ఆ స్త్రీ కృతజ్ఞత జలపాతంలా ప్రవహిస్తున్న కన్నులతో దొర వైపు చూస్తూ నిలబడింది.

"తిప్ప తీగ ఎత్తుకురా!"

మగ సింహం ఆజ్ఞాపించింది.

తీగ తెచ్చింది శీత హరిణేక్షణ.

"ఆడి చేతులు కట్టు."

ఉరిమింది కారుమేఘం.



అలనాడు

చిత్రం—మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు)

దణ్ణం పెడుతున్న చేతుల్ని చూచి కరుణ వర్షించింది కాంతికిరణం.

"బేగె బిగించు ముడి" అన్నాడు దొర.

"తెలీక చేసిందు. పరాయి రాజ్జమోడు. పోనియ్యి, దొర" అన్నది ఆ స్త్రీ.

మరొకసారి కళ్ళెర్ర జేశాడు దొర. చేతులు రెండూ కలిపి తివ్వ తీగతో బిగించి కట్టింది ఆ స్త్రీ.

వాడిని పైకి లేవమని డొక్కలో తన్నాడు దొర. నోటినుంచి రక్తం పడింది. చేతులు పట్టుకుని పైకి లేపాడు. బండ దగ్గిరికి లాక్కు వచ్చాడు. బండ మీదికి గెంటి, గండ్రగొడ్డలి ఎత్తి తల తరిగేశాడు. తల తెచ్చి మారేడుచెట్టు మొదల ఉంచి దణ్ణం పెట్టుకున్నాడు.

"ఆ స్త్రీ మనసు మారాలి. నన్ను వరించాలి."

భయంతో కంపించి పోయిందా స్త్రీ.

"నా నే పాప మెరగనిదాన్నిగింద. నన్ను రచ్చించు మరి" అని వేడుకుంది.

"నీ పేరు?"

"సీత."

"మాయలేడిలాగ మజాగ ఉండావు!"

సిగ్గు.

"ఊరు?"

"లోవ."

"లోవనే నొత్తిని. ఎక్కడ దాగున్నావె?"

"నిన్నాలిసినాను."

"సిలకలాగ పలికేవె!"

ఆ రాత్రి మారేడుమిల్లి కొండలు కాగడాల పూలు విరబూశాయి. విప్పసారా తాగిన కొండ ప్రజల వేడుకలతో వీధులూ, రోడ్లూ దద్దరిల్లి పోయాయి.

"నేటికీ కంట్రాక్టర్ వెంకటేశం జాడ తెలీదు, దొర" అన్నాడు దొర.

ఆ బండ వెనక తుప్పల్లో బొమికల గుట్టగా మిగిలాడు వెంకటేశం. కాగితం పువ్వుల వంటి బూటకపు నాగరికత అడవిలోని అజ్ఞానానికి తల వంచింది! తరతరాలుగా అమాయక అటవిక జనాన్ని దోచుకుని, వాళ్ల పరిసరాలనూ, మనసుల్నీ కలుషితం చేసిన జనం నిజం తెలిసిపోయింది.

దొర చెప్పిన కథ విన్న తరవాత ఆ విశాలమైన లోయలు ఇరుకుగా కనిపించాయి. ఉన్నతమైన శిఖరాలు శిలల్లాగ నిలబడ్డాయి.

దొర మమ్మల్ని రోడ్డు వరకూ సాగనంపి వెనక్కి మళ్లాడు. అతణ్ణి మళ్లీ చూస్తానని చెప్పాను.

ఎప్పుడు?

నాకు తెలియదు.




## గ్రాండ్ కెనియన్‌లో మొదటి నౌకాయానం

గ్రాండ్ కెనియన్ (లోయ) లో మొట్టమొదటిసారి పడవలలో ప్రయాణం చేసిన వారికి అమెరికన్ భూగర్భ తత్త్వ శాస్త్రజ్ఞుడు జాన్ వెస్లీ పవెల్ నాయకత్వం వహించాడు. ఆయన వయసు అప్పుడు 35 సంవత్సరాలు. అమెరికా అంతర్యుద్ధంలో ఆయన ఒక చెయ్యి పోగొట్టుకొన్నాడు.

గ్రాండ్ కెనియన్ తరించడానికి 1869 మే 24 న పవెల్ నాయకత్వం క్రింద పది మంది నాలుగు పడవలలో బయలుదేరారు. వారు గ్రాండ్ కెనియన్‌కు ఎగువను కొన్ని వందల మైళ్ల దూరంలో తమ సాహస యాత్ర ప్రారంభించారు. మహా భయంకరమైన వేగంతో సుళ్ళు తిరుగుతూ ప్రవహించే జలాలలో పగలు యానం సాగించేవారు. రాత్రులు ఒడ్డున విశ్రమించేవారు. ఒక్కొక్కప్పుడు జలపాతాలు అధిగమించడానికి పడవలు, సరుకులు మోసే వారు. ఒక పడవ విరిగి ముక్కలయింది. అయితే ఆ పడవలోని వారిని ఇతరులు రక్షించారు.

జూలైలో ఒకరు ఈ సాహస యాత్రకు స్వస్తి చెప్పి విరమించుకున్నారు. తతిమ్మా తొమ్మిది మంది ఆగస్టు 13 న గ్రాండ్ కెనియన్‌లో ప్రవేశించారు. ప్రవాహానికి రెండు వైపులా 5500 అడుగుల ఎత్తు ఉన్న గోడలు. కొన్ని చోట్ల వెయ్యి అడుగుల ఎత్తు వరకు నిట్ట నిలువుగా ఉన్న గోడలు. ఆగస్టు 28 న వారు కెనియన్ అంతటికీ మహా ప్రమాదకరమైన ప్రదేశం చేరారు. అప్పటికే వారి వద్ద ఉన్న తినుబండారాలు చాలా మట్టుకు ఖర్చు అయ్యాయి.

ముగ్గురు పడవలు విడిచి, రాతి గోడ ఎక్కారు. పవెల్, మరి అయిదుగురు 24 గంటల తరవాత సురక్షితంగా గ్రాండ్ కెనియన్ చివరికి చేరుకొన్నారు. చిత్రమేమంటే ప్రాణ రక్షణ కొరకు రాతిగోడ ఎక్కిన ముగ్గురిని ఇండియనులు హతమార్చారు!

అడవిలో మృగం కంటె అధ్వాన్నమైన ఆలోచన ఉన్నంత కాలం అడవిలో అడుగు పెట్టకూడదని నిర్ణయించుకున్నాము.

ఇంటికి వచ్చేసరికి జాన్ వేడినీళ్ళ తోడి ఉంచాడు.

స్నానాలు ముగించుకున్నాం.

"ఏం కూర?" అని అడిగాను.

"తమ కోసం నెమలి పిట్టల కూర" అన్నాడు ఆనందంగా జాన్.

నా కా రోజు భోజనం సహించలేదు.

సౌందర్యాన్ని చూడలేని కళ్ళు. దయ లేని మనసులు. దగా చేసే మనుషులు.

నేను కూర్చున్న గది గోడలు నాలుగు వైపులనుంచీ నా వైపు జరుగుతున్నట్టు కనిపించాయి.

ఈ గది ఇరుకు.

ఈ పరిసరాలు ఇరుకు.

ఈ లోకం మహా ఇరుకు.

ఈ మనుష్యుల మనసులు మరీ మరీ ఇరుకు.

*